క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

దంతాలపల్లి : మండల పరిధిలోని దంతాలపల్లి, పెద్దముప్పారం విద్యుత్ ఉపకేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మంగళంపల్లి ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపకేంద్రం పరిధిలోని చెట్లను తొలగించే క్రమంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనునట్లు ఆయన పేర్కొన్నారు.

చెక్కు అందజేత



కురవి : గత ఏడాది విద్యుత్ ప్రమాదంలో గాయపడి మరణించిన మండలంలోని సూదనపల్లి శివారు బీబీనాయక్ తండా జీపీకి చెందిన బోడ కిషన్ కుటుంబానికి సోమవారం మండల కేంద్రంలో రూ.5 లక్షల చెక్కును ఏడీఈ రమేశ్ అందజేశారు. ఆయన వెంట తండా మాజీ సర్పంచ్ బోడ శ్రీనునాయక్, సబ్ ఇంజనీర్ రఫీ ఉన్నారు.

గర్భిణులకు అవగాహన

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా సాధికార ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హీరిక మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధచట్టం, బేటి బచావో, బేటి పడావో, మహిళా సాధికారత గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

9న సీత్లా పండుగ జరుపుకోవాలి

కురవి: గిరిజన లంబాడీ సోదరులందరూ ఈ నెల 9వ తేదీన సీత్లా పండుగను జరుపుకోవాలని లంబాడీల ఐక్యవేదిక డోర్నకల్ నియోజకవర్గ లైవ్ అసెంబ్లీ సెక్రటరీ తేజావత్ రాంమూర్తినాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్వదినోత్సవాన్ని ఒకేసారి జరుపుకోవడం ద్వారా ఐక్యతను చాటుకోవచ్చని తెలిపారు.

75 మంది వెళ్లారు.. 64 మంది వచ్చారు

నెల్లికుదురు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలను సోమవారం చేపట్టింది. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 75 మంది ఉపాధ్యాయులు ఇతర గ్రామాలకు బదిలీ కాగా మండలానికి వివిధ పాఠశాలలకు 64 మంది బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు ఎంఈఓ తెలిపారు.

ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, సీతామహలక్ష్మి దంపతులు తమ పెళ్లిరోజు సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసముద్రం సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు బేతమళ్ల చంద్రయ్య, మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి, నాగన్న, శ్రీనివాస్, రాజిరెడ్డి, రవినాయక్, కృష్ణ, ప్రభాకర్, రజనీకాంత్ పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

మహబూబాబాద్ రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నామని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయం, నామిరెడ్డి జాయింట్ ఫ్యామిలీ ట్రస్ట్ చైర్మన్ నామిరెడ్డి హేమేంద్రదేవి, సీతారాంరెడ్డి దంపతులు సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పూజలు ఉంటాయన్నారు. భక్తులు వార్షికోత్సవ పూజ వేడుకల్లో పాల్గొని స్వామివారు కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

పరిశుభ్రత పాటించాలి



గూడూరు: పరిసర ప్రాంతాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యురాలు యమున అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సోమవారం అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలను పరీక్షించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పెద్దవాళ్లు నెలసరి ఆరోగ్య పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు పాటించాలన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తొర్రూరు: పోలెపల్లిలో మొక్క నాటుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



డోర్నకల్ : మొక్క నాటుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

తొర్రూరు: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఫత్తేపురం, పోలెపల్లి గ్రామాల్లో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా అడుగులు వేస్తే నియోజకవర్గంలో చెట్లు ఎక్కువగా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. మొక్కలు నాటి అవి వృక్షాలుగా ఎదిగే వరకు తోడుగా నిలుద్దామన్నారు. చెట్ల వల్లే వర్షాలు పడుతాయని, నియోజకవర్గంలో 33 శాతం అటవీ విస్తీర్ణం ఉండేలా చర్యలు చేపడుతామన్నారు. నియోజకవర్గాన్ని పచ్చతోరణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఆయా గ్రామ ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. ఎంపీపీ చిన్న అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, ఈజీఎస్ డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, వైస్ ఎంపీపీ ఇట్టె శ్యామ్ సుందర్‌రెడ్డి, ఎంపీడీఓ సిలార్ సాహెబ్ పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రతే లక్ష్యం

నెల్లికుదురు : పచ్చదనం పరిశుభ్రతే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామస్తులతో కలిసి విజయవంతం చేయాలని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, ఎంపీడీఓ బాలరాజు, తహసీల్దార్ రాజు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, ఎంపీఓ వాణి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉపాధ్యాయులు

కురవి: సీరోలు మండలంలోని చింతపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బానోత్ శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి రమ్యశ్రీ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

డోర్నకల్ : మండలంలోని చిలుకోడులో సోమవారం వనమహోత్సవ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈజీఎస్ ఏపీఎం పార్థసారధి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ మున్వర్‌బేగ్, గ్రామ ప్రత్యేక అధికారి వీరభద్రరావు, పంచాయతీ కార్యదర్శి నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పెద్దవంగర: కాలుష్య రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న, జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్ అన్నారు. ఆయా గ్రామాల్లో తహసీల్దార్ మహేందర్, ఎంపీడీఓ వేణుమాధవ్, ప్రత్యేక అధికారులతో కలసి మొక్కలు నాటారు.

చెట్లు మానవాళి మనుగడకు మెట్లు

కొత్తగూడ: చెట్లు మానవాళి మనుగడకు మెట్లు అని ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా కొత్తగూడ–2 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హలావత్ సాలూకి, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని గ్రామాల్లో వన మహోత్సవ వేడుకలు నిర్వహించారు. గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ఉపాధ్యాయులు, వైద్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు. అదే విధంగా హెల్త్ అండ్ న్యూట్రీషన్ డేను జరిపారు.

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లోని ఆయా గ్రామాల్లో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణం

గూడూరు : మొక్కలతోనే పర్యావరణం ఆరోగ్యవంతమైన జీవనాన్ని అందిస్తుందని జెడ్పీకో ఆప్షన్ సభ్యుడు ఎండి. ఖాసీం, ఎంపీటీసీ కత్తి స్వామి అన్నారు. మండలంలోని మర్రిమిట్టలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

రైతుల సూచనలు ప్రభుత్వానికి నివేదిస్తాం

● డీసీఓ ఎం.వెంకటేశ్వర్లు



కరవి : మాట్లాడుతున్న డీసీఓ వెంకటేశ్వర్లు

కురవి: రైతులు చేసిన పలు సూచనలు, సలహాలను ఒక నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు అందజేస్తామని జిల్లా కో ఆపరేటివ్ శాఖ అధికారి(డీసీఓ) ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కురవి ఆంధ్రాబ్యాంకు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుభరోసా పథకంపై సలహాలు, సూచనలపై సదస్సు చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సొసైటీ పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారు. మెజార్టీ రైతులు 10 ఎకరాలు ఉన్న రైతులకు రైతుభరోసా ఇవ్వాలని, గుట్టలు, ప్రభుత్వ భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్ భూములకు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మంజుఖాన్, సొసైటీ ఎండీ గుగులోత్ సుధాకర్, ఏఆర్ఓ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీపీ గుడిబోయిన రాంచంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ బాదావత్ రాము నాయక్, మాజీ ఆలయ చైర్మన్ మేక దామోదర్‌రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

రైతు భరోసాపై రైతులతో సమీక్ష

నర్సింహులపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో సోమవారం పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము అధ్యక్షతన పథకంపై సలహాలు, సూచనల కోసం సమీక్ష నిర్వహించారు. సమావేశానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అభిమన్యుడు పాల్గొని మాట్లాడుతూ రైతుల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతు వేదికలో ఉమ్మడి మండలం నుంచి 100 మందికి పైగా రైతులు విచ్చేసి మాట్లాడారు. వైస్ చైర్మన్ సంజీవరెడ్డి, ఏఈఓలు పీఏసీఎస్ డైరక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అభిప్రాయాల సేకరణ

మహబూబాబాద్ రూరల్ : రైతుభరోసాపై అభిప్రాయాల సేకరణ చేపట్టి స్థానిక రైతు వేదికలో సోమవారం పీఏసీఎస్ ప్రత్యేక మహాజన సభ ఏర్పాటు చేశారు. జిల్లా సహకార అధికారి ఎన్.వెంకటేశ్వర్లు సభలో మాట్లాడుతూ రైతులు, పీఏసీఎస్ సభ్యుల ద్వారా రైతుభరోసాపై అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ రంజిత్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రవీణ్, ఏఓ అధికారి తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ సీఈఓ కొక్కు ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● డీఈఓ రామారావు



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చదివించాలని డీఈఓ పి.రామారావు అన్నారు. మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూకల కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా వారి కుమారుడు మహేంద్రరెడ్డి 2024 పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు నగదు పారితోషకం సోమవారం అందజేశారు. 9.5 జీపీఏ సాధించిన సజనికి రూ.10 వేలు, కౌశల్యకు రూ.10 వేలు, 9.3 జీపీఏ సాధించిన అభికి రూ.6 వేలు, 9.0 జీపీఏ సాధించిన సంతోష్‌కు రూ.4 వేలు చొప్పున నూకల మహేంద్రరెడ్డి ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డాక్టర్ భూక్య వెంకట్రాములు, హెచ్ఎం సోమ విష్ణువర్ధన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పోలెపంగు భూలక్ష్మి, విద్యా కమిటీ మాజీ చైర్మన్ పోతుగంటి చిరంజీవి పాల్గొన్నారు.

దాడులు చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి



స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబం

నెల్లికుదురు: మా ఇంటి స్థలం ఆక్రమించుకుని మాపై దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బాధితుడు హెచ్.చిరంజీవి తన తల్లిదండ్రులు, భార్యాపిల్లలతో కలిసి అంబేడ్కర్ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ మా తాతల ఆస్తి మా నాన్నతో ముగ్గురు అన్నదమ్ములు సమానంగా పంపకాలు జరుపకుడా మా తండ్రి నిరక్షరాస్యుడు, అమాయకుడు కావడంతో మోసం చేసినట్లు చెప్పారు. అంతే కాకుండా మేము సొంతంగా కొనుక్కున్న ఇంటి స్థలం రెండు గుంటల స్థలాన్ని ఆక్రమించుకుని మాపై దాడులు చేస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై స్థానిక అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గత రెడు నెలల క్రితం ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. జిల్లా కలెక్టర్ రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించినా ఇప్పటి వరకు పట్టింపు లేదన్నారు. మాకు న్యాయం చేకపోతే కటుంబ సభ్యుల మంతా ఆత్మహత్యలే శరణ్యమని వేరే గత్యంతరం లేదన్నారు.

4న సన్మాన కార్యక్రమం

దంతాలపల్లి : ఈ నెల 4న ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించనునట్లు ఎంపీడీఓ వివేక్‌రామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి పదవీ కాలం ముగియడంతో వారు చేసిన సేవలకు గుర్తుగా సన్మాన కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు.

వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి



జిల్లా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఉన్న బీసీ హాస్టల్‌లో సమయపాలన పాటించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. స్థానిక బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా అధికారి నరసింహస్వామికి ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ వార్డెన్లు తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని, రోజు వరంగల్, ఖమ్మం నుంచి రాకపోకలు సాగిస్తూ విద్యార్థులకు అందుబాటులో ఉండడం లేదన్నారు. విధులకు హాజరు కాకున్నా అటెండెన్స్ వేసుకుంటున్నారని, జిల్లాల్లో ఉన్న బాలికల హాస్టల్ వార్డెన్లు ఒక్కరోజు విడిచి మరో రోజు వస్తుండడంతో బాలికలకు రక్షణ కరువైందన్నారు. గుగులోత్ సూర్యప్రకాశ్, గంధసిరి జ్యోతిబసు, నాయకులు రాజేష్, మహేష సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలి



నెహ్రూనాయక్‌ను సన్మానిస్తున్న మంగీలాల్‌నాయక్

కురవి: డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్(జీపీ) మంగీలాల్ నాయక్ అన్నారు. మండలంలోని ఉప్పరిగూడెం శివారు హట్యా తండాకు చెందిన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కమిటీ సభ్యుడు మాలోత్ నెహ్రూనాయక్‌ను సోమవారం హైదరాబాద్‌లోని హైకోర్టు జీపీ మంగీలాల్ నాయక్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ఉన్నతస్థాయికి ఎదుగుతున్న నెహ్రూనాయక్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్, మండల నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్‌నాయకుడు పాల్గొన్నారు.

వైద్యులు.. ప్రజలకు ప్రత్యక్ష దేవుళ్లు



నెహ్రూసెంటర్: జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న ఆస్పత్రి వైద్య బృందం

మహబూబాబాద్ అర్బన్: ఎంతటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రాణాలను లెక్క చేయకుండా వైద్య సేవలు అందించే వారు నిజంగా ప్రత్యక్ష దేవుళ్లు అని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు బాలునాయక్, దేవిరెడ్డి, వీరన్న, తిరుపతిరెడ్డి, సూర్యకుమారి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంబయ్య, గౌరవ అధ్యక్షుడు రవీంద్రగుప్త, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

మరిపెడ రూరల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యధికారి డాక్టర్ గుగులోతు రవిని ఆస్పత్రి స్టాఫ్, సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. సూపర్‌వైజర్ సుదర్శన్, టౌన్ ఏఎన్ఎం సరళాదేవి, కమ్యూనిటీ మెడికల్ ఆఫీసర్ శాంత కుమారి, కృష్ణ, ఫార్మసిస్ట్ పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఘనంగా డాక్టర్స్ డే సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వైద్యులను, సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ లకావత్, డాక్టర్ రవీందర్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మ సునేత్రి, శ్రీహరి, మౌనిక, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

దంతాలపల్లి : మండలకేంద్రంలోని ప్రజావైద్యశాలలో వైద్యురాలు చైతన్యకు సిబ్బంది సోమవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు వైద్యురాలికి శాలువా కప్పి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సూపర్‌వైజర్ సుజాత, కళావతి, స్వప్న రాణి, డీఈఓ వినోద్, సరిత, మహేశ్వరి, అన్వేష్, రెహమాన్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

‘క్రమశిక్షణ ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది’



అనితను సన్మానిస్తున్న నాయకులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు

కురవి: క్రమశిక్షణ ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామ రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా మూడేళ్లు విధులు నిర్వహించి పదోన్నతిపై బదిలీపై వెళ్తున్న గుర్రం అనితను కురవిలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనితకు వృత్తిపట్ల అంకితభావంతో విద్యార్థులకు ఉన్నత విద్యను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవులపల్లి రాజేశ్, అనితాశ్రీనివాస్, మేనకా రామరాజు, ఈశ్వర్, రాంచందర్, ఉపేందర్, ఎండీ అప్సర్, సలీం, శివ, షాకిరా, శ్రీలత, స్వరూప పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

నెహ్రూసెంటర్ : భూపోరాటం, ఉద్యమ సమయంలో సీపీఐ, ఇతర పార్టీల నేతలు, ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఎత్తివేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారధిరెడ్డి డిమాండ్ చేశారు. భూపోరాట కేసులో భాగంగా కోర్టుకు సోమవారం హాజరయ్యారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఇంటి స్థలాల కోసం వామపక్ష పార్టీలు చేసిన పోరాటంలో నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. రేషపల్లి నవీన్, సామ పాపయ్య, కృష్ణ పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ భర్త మృతి



కృష్ణనాయక్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని తూర్పు తండా గ్రామ మాజీ సర్పంచ్ అజ్మీరా సరిత భర్త కృష్ణనాయక్ (35) గుండెపోటుతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మొన్నటి వరకు సరిత సర్పంచ్‌గా ఉండగా ఆమె భర్త కృష్ణనాయక్ గ్రామ అభివృద్ధి పనుల విషయంలో సహకారం అందిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో గ్రామంలో పనులు నిర్వహించగా సుమారు రూ. 35 లక్షలకు పైగా అప్పులయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులు చేపట్టగా వాటికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో కృష్ణనాయక్ ఆర్థికంగా, మానసికంగా ఆందోళనకు గురవుతూ వస్తున్నాడు. శనివారం గ్రామస్తులు వన భోజనాలకు వెళ్లగా మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు కూడా వెళ్లారు. ఆ సమయంలో కృష్ణనాయక్ అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమారుడు ఉన్నారు. కృష్ణనాయక్ మృతదేహాన్ని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్, మండల గౌరవ అధ్యక్షుడు లూనావత్ అశోక్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, సుధగాని మురళి, ఆవుల వెంకన్న, బొబ్బ వెంకట్‌రెడ్డి, మద్ది వెంకట్‌రెడ్డి, భూక్య సురేందర్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షరీఫ్ సందర్శించి నివాళులర్పించారు.

స్నానం చేస్తూ కిందపడిపోయి వాచ్‌మెన్ మృతి

మహబూబాబాద్ రూరల్ : స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడిపోయి వాచ్ మెన్ మృతిచెందిన సంఘటన స్థానిక స్నేహనగర్ కాలనీలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బయ్యారం మండలం కోడిపుంజుల తండాకు చెందిన బానోత్ బిచ్యా, బద్రి దంపతులు స్నేహనగర్ కాలనీలో ఓ నూతన భవన నిర్మాణ పనుల వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బిచ్యా సోమవారం రాత్రి అదే భవన ప్రాంగణంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయగా టౌన్ ఎస్సైలు అరుణ, విజయ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని బిచ్యా మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య బద్రి ఫిర్యాదు మేరకు కొత్త చట్టాల ప్రకారం సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు.

కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండ రాజన్న

బయ్యారం: బయ్యారం పెద్దచెరువు కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మండ రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ ప్రారంభమైనా పంట కాల్వలకు నేటికీ మరమ్మతులు చేపట్టడంలో సంబంధిత ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య జోక్యం చేసుకొని చెరువు పంట కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఎస్.మధు, యాకూబ్, తిరుపతిరావు, మోహన్‌రావు, పురుషోత్తం, వెంకన్న పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురి రిమాండ్

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెంలో గత కొన్ని రోజుల క్రితం వ్యక్తిపై జరిగిన దాడి కేసులో ఆరుగురిపై కేసు నమోదు కాగా వీరిలో ముగ్గురిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. దంతాలపల్లి మండలం దాట్లకు చెందిన షేక్‌పాషా తన స్నేహితుడి గ్రామమైన పడమటిగూడెం రాగానే కొందరు యువకులు మద్యం మత్తులో బైక్‌లపై గ్రామానికి వెళ్లి మూకుమ్మడిగా దాడి చేయడంతె పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నర్సింహులపేటకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు కాగా, రవితేజ, అరవింద్, అఖిల్‌ను అరెస్ట్ చేసి, వారి వద్ద ఉన్న మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విక్రమ్, నిఖిల్, నితీష్‌లు పరారీలో ఉన్నారన్నారు. త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామని ఎస్సై తెలిపారు. శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కల్గించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.